జాలీజాలీగా హోలీ


మెట్‌పల్లి: హోలీ సంబరాల్లో సీఐ నిరంజన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది


మల్యాల: హోలీ ఆడిన యువకులు, చిన్నారులు


వెల్గటూర్: హోలీ వేడుకల్లో యువకులు


సారంగాపూర్: తుంగూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో హోలీ వేడుకలు

హోలీ.. హోలీల రంగ హోలీ అంటూ పాటలు పాడుతూ జిల్లాలో శుక్రవారం పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా కేరింతలు కొడుతూ.. రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. మిఠాయిలు తినిపించుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. రోజంతా జాలీజాలీగా గడిపారు. యువకులు బైక్‌లపై సవారి చేస్తూ గ్రామాల్లో కలియతిరిగారు. స్నేహితుల ఇళ్లలోకి వెళ్లి మరీ రంగులు పూశారు. రంగులు చల్లుకుంటూ, తలపై కోడి గుడ్లు కొట్టుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


రాయికల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..


కథలాపూర్: సిరికొండలో..


జగిత్యాలజోన్: జిల్లా కోర్టు ఆవరణలో హోలీ ఆడిన న్యాయవాదులు


జగిత్యాలరూరల్: పొరండ్లలో..


ధర్మపురిలో దుర్గమ్మకాలని వాసుల సంబరాలు


పెగడపల్లిలో రంగులు పూసుకుంటున్న మహిళలు, చిన్నారులు


ఇబ్రహీంపట్నం: గోధూర్‌లో..


మల్లాపూర్: పాతదాంరాజుపల్లిలో..

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ శుక్రవారం తెలిపారు.

నేడు బల్వంతాపూర్‌కు కేంద్ర మంత్రి రాక

మల్యాల: బల్వంతాపూర్ గ్రామానికి శనివారం కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రానున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం తెలిపారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభించనున్నారన్నారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీ

కథలాపూర్: గంభీర్‌పూర్ గ్రామ శివారులో ఓ రైతుకు చెందిన రెండు విద్యుత్ మోటార్లు, తీగలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ఒల్లపు అంజయ్య అనే రైతుకు గ్రామ శివారులో వరి పొలం ఉంది. వరి పొలానికి నీళ్లందించేందుకు రెండు మోటార్లు ఉపయోగిస్తుండగా.. గురువారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. రూ.లక్ష నష్టపోయినట్లు బాధిత రైతు చెప్పారు.

అనుకున్న లక్ష్యం సాధించాలి


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: మహిళలు తాము కోరుకున్న లక్ష్యం చేరడానికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రావణి అన్నారు. శుక్రవారం కొడిమ్యాల మండలం ఆరెపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం పద్మను సన్మానించారు. పాఠశాల కమిటీ చైర్మన్ మమత, ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్, సీఆర్‌పీ సరిత, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌కు సన్మానం



మల్లాపూర్: మండల కేంద్రంలో ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై విధుల్లో చేరిన సుంచుల నవ్యను శుక్రవారం వాల్మీకిబోయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీనుగు చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. పెనుకుల మల్లేశ్, కోరే నాగరాజు, సుంచుల నర్సయ్య దంపతులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత జగ్గాసాగర్


బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

కోరుట్ల రూరల్: యూసుఫ్‌నగర్‌లో కోరుట్ల నియోజకవర్గస్థాయి విలేజ్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. శుక్రవారం జరిగిన తుది పోరులో మెట్‌పల్లి మండలం వేంపేట్, జగ్గాసాగర్ పీఆర్ రైడర్స్ జట్లు తలపడ్డాయి. జగ్గాసాగర్ విజేతగా నిలిచింది. నిర్వాహకులు బహుమతులు అందించారు.

కుప్పకూలిన ఇల్లు



సారంగాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం ఇల్లు కుప్పకూలింది. ఇంటివారు కొన్ని క్షణాల ముందు బయటకు రావడంతో ఎలాంటి ప్రాణాపాయం చోటుచేసుకోలేదు. సారంగాపూర్ గ్రామానికి చెందిన తునికి గంగాచారికి భార్య శ్రీదేవి, కూతురు లక్ష్మీప్రసన్న, బాబు విశ్వేశ్వరచారి ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ టైలరింగ్, కూలి పని చేస్తారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసి నలుగురు ఇంటి నుంచి బయటకొచ్చిన కొన్ని క్షణాల్లో ఇల్లు కుప్పకూలింది. అందులో ఉన్న సామాన్లు, వంట సామగ్రికి నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. వీరు ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇల్లు మంజూరు రావాల్సి ఉంది. దీనిపై స్థానికులు రెవెన్యూ పరిశీలకుడు వెంకటేశ్‌కు సమాచారమందించారు.

నేడు కల్యాణం.. రేపు బోనాలు

- నాలుగు రోజులపాటు పెద్దాపూర్ మల్లన్న జాతర ఉత్సవాలు


ముస్తాబైన మల్లన్నస్వామి ఆలయం

మెట్‌పల్లిరూరల్: పెద్దాపూర్ మల్లన్నస్వామి ఆలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ఏటా కాముడి పౌర్ణమి తర్వాత జాతర ఉత్సవాలు నిర్వహించగా.. మొదటి ఆదివారం మల్లన్నస్వామికి బోనాలు తీయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ జాతరకు చుట్టుపక్కల జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి మల్లన్నస్వామికి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం కల్యాణం, ఆదివారం బోనాలు నిర్వహించనున్నారు.

శనివారం ఉదయం స్వామివారి మూలవిరాట్‌ను ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గోదావరికి తీసుకెళ్తారు. అక్కడ గంగాజలాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరుపుతారు. మూలవిరాట్‌ను ఆలయానికి తీసుకొచ్చి పునఃప్రతిష్ఠ చేస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు మల్లన్నస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఆదివారం జాతర నిర్వహిస్తారు. జాతర రోజున భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మల్లన్నస్వామిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం తర్వాత బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లన్నకు నైవేద్యం చూపుతారు. బెల్లం, గొర్రె పిల్లలను కానుకగా సమర్పిస్తారు. స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం నాగవెల్లి, ఒగ్గుకథలు ఉంటాయి. బుధవారం అగ్నిగుండంలో భక్తులు నడుస్తారు.

ఏర్పాట్లు పూర్తి

ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దర్శనానికి ఏటా భక్తులు ఎక్కువగా వస్తుండడంతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు వేయించారు. రహదారుల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, పార్కింగ్, ఇతరత్రా విషయాల్లో భక్తులకు ఇబ్బందులు కాకుండా చర్యలు చేపడుతున్నారు.

నర్సన్నకు కోడె మొక్కు


వరుసలో భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తుడు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపిస్తున్నారు. శుక్రవారం ప్రధాన, అనుబంధ ఆలయాల్లో వేలాది మంది భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. నర్సన్నకు కోడె మొక్కులు, తలనీలాలు సమర్పించారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర



కథలాపూర్: గంభీర్‌పూర్, ఇప్పపెల్లి గ్రామాల్లో శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు. అన్నదానం చేశారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, యాగండ్ల రమేశ్, పోతు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహస్వామి రథోత్సవం



వెల్గటూర్: కిషన్‌రావుపేట లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామివారి రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి స్వామివారి నామస్మరణ, జయజయ ధ్వానాల మధ్య ఆలయం పరిసర ప్రాంతంలో రథోత్సవం జరిపారు. విప్ లక్ష్మణ్‌కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

తక్కళ్లపెల్లిలో వెంకన్న జాతర



కథలాపూర్: తక్కళ్లపెల్లి గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున ప్రత్యేక పూజలందుకున్న స్వామివారు రథంపై ఆసీనులయ్యారు. రథోత్సవం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. అనంతరం జాతర ఉత్సవాలు జరిగాయి.

అలరించిన నాట్య ప్రదర్శనలు



ధర్మపురి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన చిన్నారుల కూచిపూడి, భరత నాట్యం భక్తులను అలరింపజేసింది. దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై కరీంనగర్‌కు చెందిన సంస్కృతి సంగీత విద్యాలయానికి చెందిన చిన్నారులు నాట్య ప్రదర్శనలిచ్చారు. కళాకారులను దేవస్థానం పక్షాన సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కథలాపూర్: సిరికొండ గ్రామంలో శుక్రవారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన బొజ్జ రాజేశ్, తన భార్యతో కలిసి కోరుట్ల నుంచి కథలాపూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో సిరికొండ గ్రామానికి చెందిన మైనర్ బాలుడు తన బైక్‌పై స్పీడ్‌గా వెళ్లి దంపతులు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజేశ్ తలకు తీవ్ర గాయాలు కాగా, ఆయన భార్య కాలుకు తీవ్ర గాయమైంది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాము కాటుకు గేదె మృతి

కథలాపూర్: దూలూర్‌లో శుక్రవారం బాస గంగారెడ్డి రైతుకు చెందిన గేదెను పాము కాటువేయడంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గంగారెడ్డి తన గేదెను రోజూ పశువుల పాకలో ఉంచుతారు. శుక్రవారం పాము కాటు వేయడంతో మృతిచెందినట్లు గుర్తించారు. ఈ గేదె మృతిచెందడంతో రూ.80వేలు ఆర్థికంగా నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

శ్రీరాజరాజేశ్వర, వేంకటేశ్వరస్వామి కల్యాణం



మల్లాపూర్: చిట్టాపూర్‌లో శుక్రవారం శ్రీరాజరాజేశ్వర, వేంకటేశ్వరస్వామి కల్యాణం, జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



రాయికల్: చింతలూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం వేణుగోపాలస్వామి–రుక్మిణి–సత్యభామల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకుడు సీఎంశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి కల్యాణం జరిపారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, ఆలయ కమిటీ చైర్మన్ ఓరుగంటి భూమారావు, మాజీ సర్పంచులు మోహన్‌రావు, అనుపురం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు లక్ష్మీమూర్తి, వాసుచారి, రాముచారి, కృష్ణాచార్యులు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

వెంకన్న డోలోత్సవం



కోరుట్ల: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి డోలోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన ఉయ్యాలలో డోలోత్సవం నిర్వహించారు.

నేడు వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ వార్షిక వేడుకలు శనివారం నిర్వహించనున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమం నిర్వహిస్తారు. సాయంత్రం కల్యాణం నిర్వహిస్తామని ఈవో శుక్రవారం తెలిపారు.

వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రాయికల్: ఇటిక్యాల గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ప్రతిష్ఠించి గ్రామంలోని పురవీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, ఆలయ వ్యవస్థాపకులు వంశీవర్ధన్‌రావు, విష్ణువర్ధన్‌రావు, మాజీ సర్పంచులు సామాల్ల లావణ్య, నీరటి శ్రీను, మాజీ ఎంపీటీసీ ఆదిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బోడుగం మల్లన్న, సురకంటి నాగిరెడ్డి, అనుపురం చిన్నలింబాద్రిగౌడ్, కనపర్తి శ్రీనివాస్, గంగాధర్, నేరెళ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



పెగడపల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న లోలెవల్ కల్వర్టును ఆధునికీకరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కల్వర్టుకు మూడేళ్ల క్రితం రూ.2.50కోట్లు మంజూరయ్యాయి. టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులు చేయడంలో చేస్తున్న జాప్యంతో ఈ కల్వర్టుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు చొరవ చూపి కల్వర్టు పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ, ఫోన్ నంబర్: 9440818090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643